క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడు, కస్నాతండాల్లో ఏదులాపురం పీఏసీఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ బెల్లం ఉమ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ మహమూద్అలీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, ఏఈఓ కావ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

తిరుమలాయపాలెం: నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం మండల కమిటీని సోమవారం తిరుమలాయపాలెంలో ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా జిల్లా అధ్యక్షుడు గుగులోత్ బిక్కు, జిల్లా కార్యదర్శి కాంపాటి వెంకటనారాయణ వ్యవహరించారు. సంఘం మండల అధ్యక్షుడిగా పీవీ దుర్గారావు, కార్యదర్శిగా షేక్ ఇస్మాయిల్, ఉపాధ్యక్షులుగా శ్రీను, వెంకట్, సహాయ కార్యదర్శులుగా సరస్వతి, రమణ, కోశాధికారిగా ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా బాబూరావు, ఈసీ సభ్యురాలిగా గౌషియాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాడతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

కేఎంసీ గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 38 ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఫిర్యాదులను కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ బి.మల్లీశ్వరి స్వీకరించిచారు. అనంతరం ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆర్ఓ జి.శ్రీనివాస్, ఆర్ఐ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మేడే ఘనంగా నిర్వహించాలి

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. సోమవారం వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్మిక సంఘం సమావేశంలో వారు మాట్లాడారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతిమా జోహరా, కార్పొరేటర్ కమర్తపు మురళి, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పాల్వంచ కృష్ణ, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీవై పాషా, రాంబాబు యాదవ్, కరుణ, బుర్రి వినయ్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలంలోని తెట్టెలపాడులో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం సర్పంచ్ పుసులూరి మంజుల శంకుస్థాపన చేశారు. ఎస్సీ కాలనీలో రూ.5లక్షలతో ఈ రహదారులు చేపట్టినట్లు తెలిపారు.

వినతులు..

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అండదండలతో నిర్వహిస్తున్న ఇసుక మాఫియా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండి పడుతుందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకులు సోమవారం సెంట్రల్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ రాజా రత్నాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్‌పై విచారణ చేయాలని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇంత వరకు స్పందించలేదన్నారు. వినతి అందించిన వారిలో సీనియర్ నాయకుడు గెంటెల విద్యాసాగర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రుద్రప్రదీప్, శ్యామ్ రాథోడ్, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, మోహన్‌నాయక్, భద్రం, తదితరులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడికి..



వినతిపత్రం ఇస్తున్న జూనియర్ న్యాయవాదులు

ఖమ్మంలీగల్: నూతన న్యాయవాదుల సభ్యత్వ రుసుము తగ్గించాలని జూనియర్ న్యాయవాదుల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దిరిశాల కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ న్యాయవాది భాను చందర్ మాట్లాడుతూ.. నూతనంగా వచ్చే జూనియర్ న్యాయవాదుల సభ్యత్వ రుసుము అధికంగా ఉండటం వల్ల చాలా మంది చెల్లించలేకపోతున్నారని, మా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రుసుము తగ్గించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జూనియర్ న్యాయవాదులు ముమ్మడి సతీష్, భూక్యా నాగేశ్వరరావు, నవ్య, అశ్విని, నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	విరుపాక్ష
సాయిరాం	కిసీ కా బాయ్ కిసీ కీ జాన్
ఆదిత్య	బలగం
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

- ఖమ్మంవ్యవసాయం

సిగ్నల్స్.. సరిపోట్లే!

ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులు

- సిగ్నల్స్ వద్ద వాహనాలు అస్తవ్యస్తం
- రెడ్ సిగ్నల్ పడినా దూసుకెళ్తున్న వైనం
- ప్రమాదాలు జరుగున్నా పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు
- అవగాహన కల్పించాలని ప్రజల వేడుకోలు



పాత బస్టాండ్ వద్ద ట్రాఫిక్ పరిస్థితి ఇలా..



ఎండలోనే డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్



రెడ్ సిగ్నల్ పడినా పట్టించుకోని వాహనదారులు

ఖమ్మంక్రైం: రానురాను ఖమ్మం నగరంలో విపరీతంగా ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతోంది. కానీ వాహనదారులు మాత్రం ట్రాఫిక్ నిబంధనలు కనీసం పాటించటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సిగ్నల్స్ వద్ద అస్తవ్యస్తంగా వాహనాలు ఇష్టారీతిగా నడుపుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఖమ్మం నగరానికి నిత్యం వేలాది వాహనాలు వస్తూపోతూ ఉంటాయి. వీటిలో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలు ఉండగా.. తర్వాత ఆటోలు ఉన్నాయి. కాగా వాహనాల సంఖ్య నానాటికి పెరిగిపోతుండడంతో నగరంలో శ్రీశ్రీ విగ్రహం, ఇందిరానగర్, ఇల్లెందు క్రాస్ రోడ్, ఎన్టీఆర్ జంక్షన్, బైపాస్ రోడ్డులోని ఆర్టీఓ ఆఫీస్ జంక్షన్, రాపర్తినగర్, కాల్వొడ్డు, చర్చి కాంపౌండ్, కిన్నెర పాయింట్, జెడ్పీ సెంటర్ వద్ద ట్రాఫిక్ పోలీసులు సిగ్నల్లు ఏర్పాటు చేశారు.

రెడ్ సిగ్నల్స్ బేఖాతరు..

చాలా మంది వాహనదారులకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై సరైన అవగాహన లేకపోవటంతో పాటు తొందరగా గమ్యం చేరుకోవాలనే ఆతృతతో రెడ్ సిగ్నల్స్ పడినా కూడా ఆగకుండా తమ వాహనాలను ముందుకు వేగంగా పోనిస్తున్నారు. అదే సమయంలో గ్రీన్ సిగ్నల్ పడగానే వస్తున్న వాహనాలకు ఎదురుగా వచ్చి ఢీకొట్టడంతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

అవగాహన కార్యక్రమాలకు ఫుల్‌స్టాప్..

గతంలో ట్రాఫిక్ సిగ్నల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించే విధంగా ట్రాఫిక్ సిబ్బంది గతంలో పలు కార్యక్రమాలు చేపట్టేవారు. కరోనా తర్వాత ఈ కార్యక్రమాలకు ఫుల్‌స్టాప్ పడింది. దీంతో సిగ్నల్స్‌పై అవగాహన కార్యక్రమాలు కలిగించేవారు కరువయ్యారు. ట్రాఫిక్ సిబ్బంది ఉండగానే సిగ్నల్స్‌ను పట్టించుకోకుండా వాహనదారులు వెళ్తున్నా పట్టించుకోనే వారేలేరు. మయూరిసెంటర్ వద్ద చాలాకాలంగా ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోయినా పట్టించుకోనే పరిస్థితి లేదని వాహనదారులు వాపోతున్నారు. ఇక పాత బస్టాండ్ సమీపంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. కనీస నిబంధనలను వాహనదారులు పట్టించుకోకుండా ఇష్టారీతిగా వాహనాలు నడుపుతూ ట్రాఫిక్‌కు సమస్యలు తెస్తూ సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురయ్యేలా చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ సిబ్బంది పట్టించుకోని రెడ్ సిగ్నల్స్ పడినా పట్టించుకోకుండా వెళ్తున్న వాహనదారులను ఆపి వారికి సరైన అవగాహన కల్పించాలని, నగరంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీఎస్పీతోనే రాజ్యాంగ పరిరక్షణ



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఖమ్మం మామిళ్లగూడెం: బీఎస్పీతోనే రాజ్యాంగ పరిరక్షణ సాధ్యమని ఆ పార్టీ ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జ్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బీజేపీ పాలన తీరుపై సోమవారం బైపాస్ రోడ్‌లో నిరసన తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రతిపక్షం బలంగా లేనిసమయంలో ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో మాత్రమే బీజేపీ ఈ రాష్ట్రంలో అడుగుపెట్టిందన్నారు. కానీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ రాజకీయ అరంగేట్రంతో రాష్ట్రంలో ప్రతిపక్షం పురుడుపోసుకుందని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్రాలలో అధికారంలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల అధికార దాహానికి సాధారణ ప్రజలు నలిగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు అనే ఆయుధంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో వివిధ డివిజన్ల అధ్యక్షులు పెసరమళ్లీ రవీందర్, భరత్, పుల్లారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్' విద్యార్థులకు బంగారు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

ఖమ్మంసహకారనగర్: ఎస్ఓఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ వారు నిర్వహించిన పరీక్షల్లో తమ విద్యార్థులు 52 బంగారు పతకాలు సాధించినట్లు హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. గణితశాస్త్రం పట్ల విద్యార్థుల్లోని ప్రతిభా పాటవాలను పరీక్షించేందుకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సోమవారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ ఇన్‌చార్జ్‌లు ఉమామహేశ్వరరావు, నాగరాజు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

తెల్దారుపల్లి పాఠశాలలో చిత్రకళా ప్రదర్శన

ఖమ్మంరూరల్: మండలంలోని తెల్దారుపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎల్.పద్మావతి సోమవారం చిత్రకళా ప్రదర్శనను ప్రారంభించి పరిశీలించారు. 6నుండి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు చిత్రలేఖనంలో నేర్చుకున్న మెళకువలతో కాలుష్యం, కరోనా, ప్రకృతి రమణీయం, జాతీయ సమైక్యత, నీరు, చెట్ల సంరక్షణ, పండుగలు, జాతీయ నాయకులు తదితర చిత్రాలు వందకు పైగా ప్రదర్శించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ కనకబండి రామారావు, సర్పంచ్ కోటయ్యతో పాటు తమ్మినేని వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి వసతి కల్పించాలి

నేలకొండపల్లి: మండుతున్న ఎండలకు పక్షుల కోసం ప్రతి ఒక్కరూ నీటి వసతి కల్పించాలని నేలకొండపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలేటి పరంజ్యోతి సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో వృక్ష శాస్త్ర విభాగం, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పక్షుల కోసం నీటి తొట్టిలను ఏర్పాటు చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీవీ జానకిరామారావు, డాక్టర్ బి.నాగేశ్వరరావు, డాక్టర్ వెంకటరాజం, ఎండీ రఫీ, ఆర్.కోటమ్మ, ఎం.మాధవి, బి.కవిత, పి.అనిత, వాణి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యపై అవగాహన..

ఖమ్మంసహకారనగర్: నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో సోమవారం డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్యపై విదేశాలలో కన్సల్టెంట్ సంస్థ 'ఎక్సిలా' ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ అనంతరం విదేశాలలో లభించే విద్య, ఆర్థిక అంశాలు, వీసా, స్కాలర్‌షిప్, ఉద్యోగావకాశాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కోట అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రమణారావు, ఎక్సిలా సంస్థ ప్రతినిధులు వైశాలి, అక్బర్, అయాజ్, కామర్స్ హెడ్ వై.శ్రీనివాస్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'బేబీమూన్'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

ఖమ్మంసహకారనగర్: నగరంలో బేబీమూన్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు సోమవారం చర్చి రోడ్డులో ఘనంగా నిర్వహించారు. ఈ సదర్భంగా చిన్నారులు తమ నైపుణ్యాలను ప్రదర్శించగా పాఠశాల కరస్పాండెంట్ కేసా వీరన్న వారిని అభినందించారు. పాఠశాల డైరెక్టర్ కేసా భాస్కర్, పాఠశాల మేనేజ్‌మెంట్ సుగుణ, కమల్, కల్యాణి, శోభా, ఇన్‌చార్జ్‌లు గ్రేస్ వసుంధర, కృష్ణ, టీచర్లు పాల్గొన్నారు.

అంధత్వ రహిత తెలంగాణే కేసీఆర్ లక్ష్యం



శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: అంధత్వరహిత తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నగర మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. సోమవారం నగరంలోని 22, 46వ డివిజన్‌లలో కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించిన సందర్భంగా మేయర్ మాట్లాడారు. కంటి పరీక్షలు చేయించుకొని కళ్లద్దాలను పొందాలని కోరారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఆపరేషన్ ఉచితంగా చేయబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, కార్పొరేటర్లు పల్లా రోజ్‌లీనా, కన్నం వైష్ణవీ ప్రసన్న కృష్ణ, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మాజీ కౌన్సిలర్ వంగాల వెంకట్, నాయకులు తొగరు భాస్కర్, బొల్లెపల్లి విజయ్, దేవర వెంకన్న, కాల్వొడ్డు శ్రీను, మీరా సాహెబ్, గొరిగె నాగులు, తదితరులు పాల్గొన్నారు.

ముత్తగూడేనికి తాగునీటి సరఫరా



ట్యాంకర్‌తో తాగునీరు అందిస్తున్న గౌస్‌పాషా

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడేనికి తాగునీరు సరఫరా లేక ఐదు రోజులు గడుస్తున్నప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజల ఇబ్బందులు గమనించిన గ్రామపెద్దలు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ పాషా ట్యాంకర్ల ద్వారా తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో మోటార్ల ద్వారా ట్యాంక్‌లకు మంచినీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఉన్న మిషన్ భగీరథ లైన్ కూడా పనిచేయకపోవడంతో మంచినీటి సమస్య తీవ్రమైందని తెలిపారు. అయినా గ్రామపంచాయతీ పాలకవర్గం కానీ, అధికారులు కానీ పట్టించుకోవడంలేదని, తక్షణమే అధికారులు స్పందించి గ్రామానికి తాగునీరు అందించాలని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం తీరు సరికాదు

ఖమ్మంసహకారనగర్: ఎన్‌సీఈఆర్టీ సిలబస్ నుంచి జీవ పరిణామక్రమం, పునరుత్పత్తి పాఠ్యాంశాలతో పాటు చరిత్ర నుంచి మొఘలుల చరిత్ర, గాంధీ హత్య, గుజరాత్ అల్లర్లు తదితర పాఠ్యాంశాలను తొలగించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా కమిటీ పక్షాన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. ఈ చర్య చరిత్ర, సైన్స్‌పై మత శక్తుల దాడిగా పేర్కొంటూ నూతన విద్యా విధానం పేరిట భారతీయ సమాజంపై కేంద్ర ప్రభుత్వ ధ్వంస రచన ప్రారంభమైందని ఆందోళన వ్యక్తం చేశారు.అభ్యుదయ, ప్రజాస్వామిక వాదులు, సైన్స్ ప్రేమికులు అందరూ ఈ చర్యలను తీవ్రంగా ప్రతిఘటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌సీఈఆర్టీ తక్షణమే తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కుల, మత సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్

ఖమ్మంఅర్బన్/ఖమ్మంమామిళ్లగూడెం: కుల, మత సామరస్యానికి ప్రతీక ఈద్ మిలాప్ అని మస్జిద్ ఎ-ఆయషా సదర్ షేక్ అబ్దుల్ రషీద్ అన్నారు. గొల్లగూడెం రోడ్ మధురానగర్ 3వ లైన్ మస్జిద్ ఎ-ఆయషాలో నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమాజంలో సోదర భావం, మానవ నైతిక విలువలు, దైవ భీతి ఏర్పడి సన్మార్గంలో నడుచుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు.అనంతరం ప్రజలకు అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్, శ్రీ సాయిబాబా టెంపుల్ అధ్యక్షుడు కూరాకుల నాగభూషణం, 14వ డివిజన్ కార్పొరేటర్ కూరాకుల వలరాజు, నిర్వహణ కమిటీ సభ్యులు ఎండీ రహీముద్దీన్, ఎస్‌డీ కరీంముల్లాబాజి, షేక్ హుస్సేన్, షేక్ ఇమాంవలి, షేక్ జానిపాషా, షేక్ ఖాజావియా, తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం ఇవ్వాలి



నేలకొండపల్లి: తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శులు నండ్ర ప్రసాద్, కేవీ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ నాయకులు కాశిబోయిన అయోధ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నేలకొండపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరులతో అయోధ్య, ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురంలో నండ్ర ప్రసాద్, నేలకొండపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో తడిసిన ధాన్యం, మామిడి పంటలను కేవీ రెడ్డి ఆధ్వర్యంలో పరిశీలించిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకృతి ప్రకోపంతో చేతికందిన పంట వర్షానికి తడిసిపోయిందని, మామిడి తోటకు ఎకరాకు రూ. 50వేలు, వరికి రూ. 30వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో ఆప్ పార్టీ పాలేరు ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్, పార్టీ నాయకులు గడువర్తి నాగేశ్వరరావు, రచ్చా నరసింహారావు, ఏటుకూరి రామారావు, బెల్లం లక్ష్మి, పగిడికత్తుల నాగేశ్వరరావు, వి.సుదర్శన్‌రెడ్డి, డి. నాగయ్య, మామిండ్ల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేలకొండపల్లి మండలంలో వరి 1,000 ఎకరాలు, మొక్కజొన్న 100 ఎకరాల వరకు నష్టం వాటిల్లినట్లు మండల వ్యవసాయాధికారి కె.అరుణ పంట నష్టంపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు.

పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



గజమాలతో సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంరూరల్/కూసుమంచి: ఖమ్మంలో సోమవారం జరిగిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వచ్చారు.ఈ సందర్భంగా జిల్లా సరిహద్దు నాయకన్‌గూడెంతో పాటు ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చి ఘన స్వాగతం పలికారు. రేవంత్‌రెడ్డికి రెండు గజమాలలు వేసి సత్కరించారు. ఈకార్యక్రమాల్లో కాంగ్రెస్ మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, రామసహాయం మాధవీరెడ్డి, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, కళ్లెం వెంకటరెడ్డి, మందడి ఇజ్రాయిల్, సీహెచ్. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..

గ్రామపంచాయతీ పాలకవర్గానికి..



సన్మానం పొందిన సర్పంచ్, తదితరులు

కూసుమంచి: జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలేరు గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని, సిబ్బందిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ఉత్తమ పంచాయతీగా అవార్డు పొందగా సర్పంచ్ ఎడవెల్లి మంగమ్మ, ఉప సర్పంచ్ యాకుబ్ పాషా, ఎంపీటీసీ శీలం నాగమణి, గ్రామ కార్యదర్శి నరేష్‌లను ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ రాంచంద్రరావు తదితరులు సన్మానించారు.

దళితరత్న అవార్డు గ్రహీతకు..

ఖమ్మం మామిళ్లగూడెం: దళితరత్న అవార్డు అందుకున్న మాదిగ హక్కుల దండోర రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్ మాదిగకు సోమవారం మాదిగ హక్కుల దండోర జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయంలో ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోర జిల్లా నాయకులు నరసింహారావుమాదిగ, వీరస్వామి, కోటేశ్వరావు, శ్రీను, వెంకయ్య, కాటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రిన్సిపాల్‌కు అవార్డు

ఖమ్మంసహకారనగర్: విద్యారంగంలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి అసాధారణ ఫలితాలు సాధించినందుకు ఇంటర్‌నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ మేనేజ్‌మెంట్ న్యూఢిల్లీ వారు స్థానిక ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహమ్మద్ జాకీరుల్లాకు అవార్డు ప్రదానం చేశారు. ఈ నెల 13న ఢిల్లీలో నిర్వహించిన ఆసియా పసిఫిక్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవానికి ప్రిన్సిపాల్ గైర్హాజరు కావడంతో పోస్ట్ ద్వారా ప్రమాణ పత్రం, జ్ఞాపికను నిర్వాహకులు పంపించారు. ఈమేరకు కళాశాల అధ్యాపక బృందం ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

'చలో హైదరాబాద్' పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మంలీగల్: న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోసం ఐలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్లను సోమవారం కోర్టు ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలు బాధ్యుడు కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలు బాధ్యులు మందడపు శ్రీనివాసరావు, నవీన్ చైతన్య, గంగాధర్, ఏడునూతల శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, చింత నిప్పు వెంకట్, వనజాకుల లక్ష్మీనారాయణ, శ్రీలక్ష్మి, స్వప్న తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల పోస్టు కార్డుల ఉద్యమం



పోస్టుకార్డులు చూపిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

నేలకొండపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యూలరైజేషన్ చేయాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు సోమవారం పోస్టుకార్డు లేఖలు పంపించారు. ఈమేరకు నేలకొండపల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేపీఎస్ సంఘం జిల్లా నాయకుడు బైరం దినేష్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణలో జాతీయస్థాయిలో ఉత్తమ పంచాయతీలుగా అవార్డులు రావటానికి నిరంతరం కృషి చేసిన కార్యదర్శులను విస్మరించడం బాధకరమని, కేసీఆర్ హామీలు అమలు చేయకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సంఘం నాయకులు నరేష్, బోళ్ల వీరబాబు, కె. రామారావు, లింగరాజు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



పంపిణీ చేస్తున్న మార్కెట్ కమిటీ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ కమిటీ, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో సోమవారం పంట విక్రయానికి వచ్చిన రైతులకు, గుమస్తాలు, వ్యాపారులు తదితరులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేషం, ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, ఉపాధ్యక్షుడు సోమా నర్సింహారావుతో పాటు మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, ముత్యం ఉప్పల్‌రావు, యడ్లపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దీపికలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

తిరుమలాయపాలెం: డ్వాక్రా సంఘాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న గ్రామదీపికలకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ దీపికల సంఘం జిల్లా అధ్యక్షురాలు సుశీల అన్నారు. సోమవారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన గ్రామ దీపికల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ దీపికలు విజయలక్ష్మి, ఉమ, ఇందిర, రమ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ప్రతినిధుల సభ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందాల

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మమతా గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించే బీఆర్ఎస్ ప్రతినిధుల సభకు మహిళలు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ నగర మహిళా అధ్యక్షురాలు తస్నీరు శోభారాణి పిలుపునిచ్చారు. సోమవారం వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశంలో సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నగర పార్టీ ప్రచార కార్యదర్శి షేక్ షకీనా, ఖానాపురం హవేలి మహిళా కన్వీనర్ కొడెం తార, జయమ్మ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే..

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాలో గల చల్లపల్లి గార్డెన్స్‌లో మంగళవారం జరిగే బీఆర్ఎస్ పాలేరు నియోజకవర్గ ప్రతినిధుల సభ ఏర్పాట్లను ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించాక రాజకీయ తీర్మానాలపై చర్చ ఉంటుందని తెలిపారు. అనంతరం కిసాన్ కన్వెన్షన్‌లో జరిగిన పీఆర్‌టీయూ పాలేరు నియోజకవర్గ ప్రాంతీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, మోహన్, జి.సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.